## ఆ పరీక్షలు నిబంధనలకు విరుద్ధం: ఇంటర్ బోర్డు

ఈనాడు, హైదరాబాద్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం రాతపరీక్షలు జరపడం నిబంధనలకు విరుద్ధమని ఇంటర్ బోర్డు తెలిపింది. కొన్ని కార్పొరేట్ కళాశాలలు ప్రవేశాల కోసం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని బోర్డు కార్యదర్శి రామశంకరనాయక్ చెప్పారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సాధించిన శ్రేణులను అనుసరించి మాత్రమే నిర్ణీత సమయంలోనే ప్రవేశాలను జరపాలని స్పష్టం చేశారు.

## ప్రత్యేక ఉపాధ్యాయుల్ని నియమించాలని వ్యాజ్యం

మానసిక వికలాంగులైన చిన్నారులకు సరైన శిక్షణ ఇచ్చేందుకు.. ప్రత్యేక ఉపాధ్యాయుల్ని నియమించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో శనివారం ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. రంగారెడ్డి జిల్లా 'చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్ పేరెంట్స్ అసోసియేషన్" అధ్యక్షురాలు సి.సుధారాణి వ్యాజ్యం దాఖలు చేశారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, రాజీవ్ విద్యామిషన్ స్పెషల్ ప్రాజెక్టు డైరెక్టర్, భారత పునరావాస మండలి కార్యదర్శి, కేంద్ర మానవ వనరులశాఖ కార్యదర్శి తదితరుల్ని ప్రతివాదులుగా చేర్చారు.